# మావారి పెళ్ళి

"రేపు నా పెళ్ళి, తెలుసా ?" అన్నారు మావారు నవ్వుకుంటూ పలహారం ప్లేటు టేబిలు మీద పెడుతున్న నన్ను చూసి.

"మీకు...?" అడిగాను వారి మాటల్లోని అంతరార్థం గ్రహించలేక.

"నాకు–పెళ్ళి. అందుకే ఇంత హడావిడిగా వచ్చాను, అన్నారు.

"ఆ! మీకు పెళ్ళా?" అన్నాను వచ్చే నవ్వును ఆపుకుంటూ. "పాకీదానితోనా, పని మనిషితోనా ?" అన్నాను ఇంకా నవ్వుతూ.

మేము మహబూబునగరంలో కొత్తగా కాపురం పెట్టినప్పుడు ఊరికి దూరంలో ఉన్న మా యింటికి పని మనుషులు కుదిరేవారుకాదు. ఒకవేళ కుదిరినా నాలుగు రోజులుకూడా ఉండేవారుకాదు. ఆరోజుల్లో అక్కడ నీళ్ళకు ఇబ్బంది వుండేది. మేము అద్దెకు ఉన్న వాళ్ళ యింట్లోంచి నీళ్ళు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఉదయం లేవగానే వాళ్ళింటి నుండి నీళ్ళు తెచ్చుకోవటం, పాచిపని చేసుకోవటం, వండుకోటం శ్రమగా వుండేది పనివాళ్ళు రానప్పుడల్లా. అప్పుడు మా వారికి అమోఘమయిన ఐడియా తట్టింది. నా బాధ చూళ్ళేక "కట్టకట్టి వీళ్ళందరినీ పెళ్లాడేస్తాను. తిండిపడేస్తే ఇంట్లోనే పడివుంటారు." అనేవారు. నాకు ఆమాట జ్ఞాపకం వచ్చింది.

"పాకీదీ కాదు పనిమనిషీకాదు, ఒక గ్రాడ్యుయేటును." అన్నారు ఫలహారం తింటూనే.

ఆమాట తమాషాకుకాక నిజంగా సీరియస్‌గా అన్నట్టు అనిపించింది. వారు నవ్వుకుంటూ అన్నట్టే నేనూ నవ్వు మొహంతోనే అడిగాను. "ఓహో ! అయితే ఎవర్ని పెళ్లాడుతున్నారు దేవరవారు ?" అని.

"ఉందిలే ! ఒక మంచిపిల్ల ! మేమిద్దరం చాలరోజులబట్టి ప్రేమించుకుంటున్నాము." అన్నారు.

ఆమాటవిని మళ్ళీ నవ్వొచ్చింది.

నందగిరి ఇందిరాదేవి

"ఏడిసినట్టే ఉంది! నాకు ఉత్తరం రాయటానికి తీరదుకాని, ఎవరినో ప్రేమిస్తున్నారట. చెపితే నమ్మేట్టు అన్నా ఉండాలి." అన్నాను ఏమాత్రం తొణక కుండా.

తొణకాల్సిన అవసరంకూడా లేదు. ఎందుకంటే తీర్పులు చెప్పటంలో ఊపిరి సలపని వారికి ప్రేమించిటానికి, హఠాత్తుగా ఊడిపడి పెళ్ళి చేసుకుంటానికి ఎంత టైము కావాలి! అంతటైమే ఉంటే ఇంకో రెండు జెడ్జిమెంట్లు రాసుకోవచ్చు ననే తత్వం వారిది!

మంచినీళ్ళు త్రాగి గ్లాసు అందించి, "అయ్యో! నువ్వు నమ్మకపోతే ఏం చేయను! నేను అసలు అబద్ధం చెపుతానా?" అన్నారు లేచి నిలబడుతూ.

"Truth, whole truth, nothing but the truth," ఇతరులతో చెప్పిస్తారు కాని మీరు చెప్పాలని ఎక్కడుంది లెండి!'' అన్నాను, తేలికగా నవ్వి పారేస్తూ.

''సరే, నీయిష్టం! నేను ఏదీ నీతో దాచలేదు. ఇది కూడా దాచటం లేదు. రేపు ఉదయం దేవాలయానికెళ్ళాలి. సాయంత్రం మన యింట్లోవిందు. అన్ని ఏర్పాట్లూ నీ చేతిమీదుగా జరగాలి," అన్నారు నన్ను దగ్గరకు తీసుకుంటూ.

ఇంతలో కారుహారను మోగింది.

"నే నిప్పుడే కాస్త బజారెళ్ళి వస్తా." అనుకుంటూ వెళ్ళారు స్నేహితుడి కార్లో.

నాకేమీ పాలుపోలేదు. ఈ యీడులో ఈ పిల్లలతో తనకు పెళ్ళేమిటి? నిజంగానే ఇంతవరకు ఏదీ దాచలేదు. అయినా తాతకు పెళ్ళిలావుంది! వారు అబద్ధం చెప్పటంలేదని అన్నా, అది పచ్చి అబద్ధం అయినా భార్య ఉండగా పెళ్ళిచేసుకున్న వాళ్ళనూ చూశాంగా. ఎవరికీ తెలియకుండా ఏ గుళ్ళో చేసుకోటమో లేక పోలీసు పహరాతో చేసుకోటమోచూశాం కాని ఈ విపరీతం, ఈ అమాయికం చూళ్ళేదు. నేనే చేయించాలట పెళ్ళి! ఏదో జోక్ చేస్తున్నారు. ఓ! నేనులొంగి ''అయ్యో! ఎట్లా?'' అని ఏడుస్తాననుకున్నారు కాబోలు! అంతా వొట్టిదే — నన్ను భయపెట్టి fool ని చేద్దామని...

ఇట్లాంటి ఆలోచనలన్నీ వెనక్కునెట్టి ఆదే బయటపడుతుంది ఆతమాషా యేమిటో ననుకొని, మళ్ళీ రాత్రికి వంట చేసి చంటివాడికి పాఠం చెప్పుకొంటున్నాను.

ఇంతలో ఒకావిడ లడ్డూలుచేసే జల్లి గంటెలు, అన్నంవార్చే తట్ట పట్టుకొని, గేటుదగ్గర నిలబడ్డ మా నౌకరును, "ఫలానా వారిల్లుఇదేనా?" అని అడుగుతోంది. పాఠం ఆపి మేడమీదినుంచి చూశాను. ఆవిడలోపలికి వచ్చింది.

కిందికివచ్చి, "ఎవరు కావాలి?'' అనడిగాను.

"మన యింట్లో రేపురాత్రి విందటగా. ఎంతమందికి, ఏం చేయిస్తారో చెపితే సామాన్లు రాయిస్తాను.'' అన్నదావిడ.

నాకు కొంచెం కోపం వొచ్చింది. "ఎవరు చెప్పారుమీకు ?" అన్నాను. ఇంట్లో ఏదయినా పట్టించుకోని వారికి వంటమనిషిని మాట్లాడి పంపే తెలివి ఎప్పటినుంచీ అని.

"బాబుగారి స్నేహితులటమ్మా. వారు మాయింటికి మనిషిని పంపి ఇక్కడికి వెళ్లమన్నారు." అన్నది. సరే పెళ్ళి అబద్ధమయినా విందు నిజమన్నమాట అనుకొని మామూలుగా విందుకు ఎప్పుడు ఏం చేయిస్తానో చెప్పి ప్రతిఫలంకూడా మాట్లాడి ఇంట్లోలేని సామాను లిస్టు రాసుకున్నాను. ఆవిడ ఆ గరిటలు మా నౌకరు కిచ్చి రేపు మధ్యాహ్నం వస్తానని చెప్పి వెళ్ళిపోయింది. ఆవిడటు వెళ్ళిందో లేదో "రేపు ఇంటికి లైట్లు పెట్టమన్నారు. ఇల్లు పనివాళ్ళకు చూపించి పోదామని వచ్చాను." అన్నా డొకతను. జోరుగానే ఉన్నాయి పెళ్ళి ఏర్పాట్లు అని అనుకుంటూ వుంటే,

"అమ్మా, అమ్మా, మనయింట్లో ఏమిటే ?" అన్నాడు చంటివాడు. ఏమిటీ? మనయింట్లో !

"మీ నాన్న పెళ్ళి !'' అన్నాను వెటకారంగా.

ఆ మాట వినీవినడంతోనే మేడమీద చదువుకుంటూన్న పెద్దపిల్లలదగ్గరికి వెళ్ళి "మనింట్లో పెళ్ళిరోయి! లడ్డూలు, చేస్తున్నారు ! లైట్లు పెడుతున్నారు." అని గోలగా అరిచాడు. వాడట్లా అరుస్తుంటే చికాకుపుట్టి, "పాఠం చదవకుండా ఆ గంతు లేమి"టని ఒక్కటి అంటించాను.

బజారెళ్ళిన మా వారు ఇంకా రాలేదు. ఒకవేపు సన్నాహాలు కనబడుతున్నా వారు చెప్పిన అబద్ధం నిజమని నామనసు ఒప్పుకోటం లేదు. ఆ చెప్పే మాట కూడా నా తల నిమురుతూ నన్ను దగ్గరకు తీసుకొని చెప్పుతారేం ? అబ్బ ! ఆ చేతుల్లో ఎంత ఆకర్షణ ! ఆ గొంతులో వెయ్యివీణల స్వరం! వారి నోటవచ్చిన ఆ మాట చేదుది అయినా సరే మాధుర్యం ఉట్టిపడుతోంది !

ఎందుకో చప్పున పెళ్ళికాకముందు వారు వ్రాసిన మొదటి ఉత్తరం జ్ఞాపకం వొచ్చింది.

"...ఇట్లాంటినన్ను – బాగా ఆలోచించుకొండి !...ఆ తర్వాత నన్ను అంటే లాభంలేదు." అని వ్రాశారు. వారు ఏం చేసినా ఆ బాధ్యతంతా నాదేనన్నమాట. మా బామ్మ అంటుండేది 'చాలారోజులు మగవాళ్ళను ఒంటరిగా ఉంచకూడదు' అని. పిల్లల చదువు, వారి ఉద్యోగం మూలానా వారు ఒక వూళ్ళో, నే నొక వూళ్ళో!

ఛా ! ఎంత పాపిష్టిది మనసు. పాడు

ఆలోచనలు పోతున్నాయి అని నన్ను నేను తిట్టుకున్నాను.

పిల్లలంతా అన్నాలు తిని పడుకున్నారు. వారు వచ్చి నేరుగా పడకగదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చేవరకు భోజనం సిద్ధంచేశాను. మేడమెట్లు దిగివస్తుంటే తెల్లటి చొక్కా, తెల్లటి పయిజామా నల్లని చెప్పుల్లో మెరిసిపోతున్నారు.

"కొత్తపెళ్ళికొడుకు కళవచ్చిందే'' అన్నాను నవ్వుకుంటూ.

నా కళ్ళల్లోకి చూసి, "ఏం? కానా మరి?" అని అనుకుంటూ అందిచ్చిన తువాలుతో చేతులు తుడుచుకుని భోజనానికి కూర్చున్నారు.

"ఏం తెచ్చారు బజారునుండి?" అన్నాను మామూలు ధోరణిలోనే.

వారు ఎంతో ఉత్సాహంగా, "అబ్బ! ఎన్ని దుకాణాలు తిరిగా ననుకున్నావు? నాకు నచ్చినవి దొరికేటప్పటికి ఈ వేళ అయింది. చూద్దువుగాని — పైన పెట్టించా పాకెట్టులు. అది సరేగాని, వంటమనిషి, లైట్లవాళ్ళు వచ్చారా?'' అన్నారు.

"ఆ! వచ్చారు." అన్నాను ముక్తసరిగా.

"నీకు అంత ఉత్సాహంగా లేనట్టు ఉంది నేను పెళ్ళి చేసుకుంటూ వుంటే!" అన్నారు. లాయరు తెలివి తేటలతో నా అభిప్రాయం కనుక్కుందామనేమో! నేను బెట్టు సడలించలేదు — బావురుమనలేదు.

"ఓ లేకేం! రేపటి విందుకు, లడ్డూ, ఆలుబాత్, పకోడీలు, పక్వాన్నాలు చేయిస్తున్నా. చెట్లల్లో కూడా బల్బులు పెట్టమన్నా. రంగు రంగుల బల్బుల పెడితే చాల బాగుంటాయి. కదండీ" అన్నాను ఉత్సాహం తెచ్చిపెట్టుకుంటూ.

వారు ముసిముసిగా నవ్వుకున్నారు. భోంచేశాక ఈ పెళ్ళి అంతు ఏమిటో అదే తేలుతుంది. తొందరపడటం దేనికని నిగ్రహించుకొని భోజనం ముగించా.

మేడమీదకు వెళ్ళి తమలపాకులు కడ్తుంటే ఒక్కొక్క పాకెట్టు విప్పటం మొదలెట్టారు.

"ఇదుగో చూడూ, ఈ చీరలు పెళ్ళికూతురికి అని తెచ్చాను. ఈ రంగు బాగుందికదూ. ఈ అంచుచూడు — జరీ — జరీ ఎట్లా మెరిసిపోతోందో! ఇదిగో ఇదిచూడూ. ఒంటిరవ్వ ఉంగరం!" అని ఉత్సాహంగా చెప్పుకుంటూ చూపించారు. అవన్నీ చూశాక ఈ పెళ్ళి నేను అనుకున్నంత తేలికవ్యవహారంలాగ కనపడటం లేదే! అనుకున్నాను.

"ఇంతకీ పెళ్ళికూతురు ఎవరు? ఏ వూరు? చెప్పనే లేదు" అన్నాను అవన్నీ మడతలు చెరగకుండా మళ్ళీ డబ్బాల్లో పెడుతూ.

''చూస్తావుగా రేపు'' అన్నారు.

"పాపం! ఆమె ఎవరో ఎరక్క గోతిలో పడుతోంది! మీలాంటివారిని చేసుకుని ఏం సుఖపడుతుందని! ఎవరో తెలిస్తే బాగుండును!'' అన్నాను నాలో నేను అనుకున్నట్టు.

''వెళ్ళి చెప్పొస్తావా చేసుకోవద్దని?" అన్నారు.

''ఆహా! మీతో నేను కాబట్టి వేగుతున్నాను. చకోరపక్షిలా ఎదురు చూడగా దర్శనమే దుర్లభమయ్యే మీతో నేను కాగా కాపరం చేస్తున్నాను'' అన్నాను. నా కంఠంలో కొద్దిగా జీర, నా మాటల్లో వ్యధ అనుకోకుండా ప్రకటితమయ్యాయి.

ఇంకా చెప్పలేక వారిగుండెల్లో తల దాచుకున్నాను. అంతా అయోమయమనిపించింది. కొట్టినా తల్లికాళ్ళకే చుట్టుకునే పసిపిల్లలాగా వారిని చుట్టేసుకున్నాను. వారి చేతుల్లో ఇమిడిపోయిన నన్ను మరింత గట్టిగా అదుముకొని.

''ఆ పిల్ల యెవరో చెప్పనా మరి? అన్నారు.

''చెప్పండి! దాచటం యెందుకూ?'' అన్నాను ధైర్యం కూడగట్టుకుంటూ.

నా మొహంలో మొహం పెట్టి, ''ఆ పిల్లవు నువ్వే'' అన్నారు.

''నేనా! మరి పెళ్ళేమిటి?'' అన్నాను వారి బాహుబంధం విడిపించుకుంటూ.

''నిన్ను మళ్ళీ కొత్తపెళ్ళికూతురులా చూడాలని వుంది'' అని ఆ తెచ్చిన ఉంగరం వ్రేలికి తొడిగారు.

''మన పెళ్ళయి రేపటికి పాతికేళ్ళు. కథలో చెపుతారే అట్లా, ఆకాశం అంత పందిరేసి, భూమంత అరుగేసి, ఆ పెళ్ళి అబద్ధమని, ఈ పెళ్ళి నిజమని, మన వాళ్ళందరికీ విందు చేద్దాము'' అన్నారు.

ఆ మధుర క్షణంలో కాంతం 'నీవు నా కెక్కడ దొరికావు?' అని ఆమె భర్తను అడిగిన ప్రశ్న నాకూ కలిగింది.

అవును! ఈ అమృతమూర్తి ఎక్కడ దొరికారు నాకు! ఈ ప్రేమ పెన్నిధి సాంగత్యం ఎట్లా లభించింది!

నా హృదయంలో ఈ ప్రశ్నకు జవాబే ముంది! ఏదో పూర్వపుణ్య సుకృతం! అంతే!

